క్లుప్తంగా

6న ప్రమాణ స్వీకారం

నకిరేకల్ : నకిరేకల్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్‌పర్సన్‌గా కందాల శోభారాణిశ్రీనివాస్‌రెడ్డి ఈ నెల 6న ప్రమాణ స్వీకారం చేయనున్నారని రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర శంభులింగారెడ్డి శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పలకలు అందజేత



పలకలు అందజేస్తున్న బాలయ్య

చిట్యాల : మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన మంకాల బాలయ్య తన భార్య రాములమ్మ జ్ఞాపకార్థం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-1 చిన్నారులకు శుక్రవారం పలకలు, బలపాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం టీచర్ పెరిక రేణుక, ఆయా ఉయ్యాల లింగమ్మ, మంకాల శ్రీను, గోవర్ధన్, సంజన పాల్గొన్నారు.

దోస్త్ స్పెషల్ డ్రైవ్

నకిరేకల్ : నకిరేకల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ, బీజెడ్‌సీ ఎంపీసీఎస్, బీకాం కంప్యూటర్స్, బీఏ తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో అడ్మిషన్ల కోసం దోస్త్ స్పెషల్ డ్రైవ్ ఈ నెల 7 నుంచి 14 వరకు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు దోస్త్ రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు, రిజిస్ట్రేషన్ చేసుకుని అడ్మిషన్ పొందని వారికి ఇదే చివరి అవకాశమని తెలిపారు. దోస్త్ అడ్మిషన్ల కోసం వి.శేఖర్ సెల్ 9959342659, ఎస్.వెంకన్న 9866238586 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని వివరించారు.

యానాల మల్లారెడ్డికి నివాళి

నకిరేకల్ : సాయుధపోరాట యోధుడు, రైతు కూలీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు యానాల మల్లారెడ్డి 21వ వర్ధంతిని సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం నకిరేకల్‌లో నిర్వహించారు. మల్లారెడ్డి చిత్రపటానికి ఇందూరు సాగర్, అంబటి చిరంజీవి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బొగు రాల నర్సింహ, చెరుకు సైదులు, మామిడోజు వెంకన్న, జానపాటి దేవయ్య పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విఘ్నేశ్వర్‌రెడ్డి

కనగల్ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎర్రమాద విఘ్నేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చర్లగౌరారం గ్రామంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం బత్తుల నరహరి, సర్పంచ్ చింతల యాదగిరి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

నకిరేకల్ : టీపీసీసీ నేత దైద రవీందర్ ఆధ్వర్యంలో శుక్రవారం నకిరేకల్‌లోని వివిధ వార్డుల్లో ఇంటింటా కాంగ్రెస్ పార్టీ హామీలు-ప్రగతి సోపానాల ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరపత్రంలో ఉన్న హామీలు అన్నీ అమలుచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గార్లపాటి రవీందర్‌రెడ్డి, బొబ్బలి నర్సింహారెడ్డి, గురుమూర్తి, పశుపతి, రఘుపతి, మన్సూర్, దీకొంట శ్రీను, యూసఫ్, జగన్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

కేతేపల్లి : సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం తుఫాను వరద బాధితుల కోసం విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, కోట లింగయ్య, కర్ర బాలయ్య, గోలి ఎల్లయ్య, ఎ.నాగయ్య, పల్లయ్య, సందీప్, రమణ పాల్గొన్నారు.

చెత్త సేకరించిన సర్పంచ్

మర్రిగూడ : గ్రామ పంచాయతీ కార్మికులు నెల రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న కారణంగా గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. దీంతో శుక్రవారం మండలంలోని మేటిచందాపురం సర్పంచ్ జంగిలి లక్ష్మీప్రసన్న వీధుల వెంట చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ భర్త రవి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ నడుపుతుండగా సర్పంచ్ తడిపొడి చెత్త సేకరించారు.



మేటిచందాపురంలో చెత్తను సేకరిస్తున్న సర్పంచ్ లక్ష్మీప్రసన్న

ఆక్రమణలతో నిలిచిన రోడ్డు పనులు

- పావురాలగూడెం-చౌళ్లగూడెం రోడ్డుకు రూ. 3.02 కోట్లు మంజూరు
- పావురాలగూడెం గ్రామంలో ఆక్రమణకు గురైన రోడ్డు
- ముందుకు సాగని పనులు

శాలిగౌరారం : ×దేవుడు వరమిచ్చినా పూజారి అడ్డుకున్నట్లు×గా ఉంది మండలంలోని పావురాలగూడెం-చౌళ్లగూడెం ఆర్‌అండ్‌బీ రోడ్డు పరిస్థితి. రోడ్డు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. అయితే గ్రామంలోని నాయకుల ఆధిపత్యపోరు అభివృద్ధి పనులకు ఆటంకంగా మారింది. దీంతో రోడ్డు పనులు పూర్తికాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

7 కిలో మీటర్లు.. రూ. 3.02 కోట్లు

శాలిగౌరారం మండలకేంద్రంలోని పావురాలగూడెం బస్‌స్టాప్ నుంచి మాధారంకలాన్ గ్రామపంచాయతీ పరిధి చౌళ్లగూడెం వద్ద ఉన్న 365వ నంబర్ జాతీయ రహదారి వరకు 7 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ సింగిల్ రోడ్డు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.3.02 కోట్ల నిధులు మంజూరు చేసింది. మూడు నెలల క్రితం అగ్రిమెంట్ కాగా రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం సంవత్సరం గడువు ఇచ్చింది. జూన్ 20న పనులను తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ మండలకేంద్రంలో ప్రారంభించారు. 7 కిలోమీటర్ల రోడ్డు పనుల్లో కిలోమీటర్ సీసీ రోడ్డు, 6 కిలోమీటర్లు బీటీ రెన్యూవల్ పనులు చేయనున్నారు. పావులరాలగూడెంలో 18 అడుగుల వెడల్పుతో 600 మీటర్ల పొడవు, ఊట్కూరు గ్రామంలో 12 అడుగుల వెడల్పుతో 400 మీటర్ల పొడవు సీసీ రోడ్డు నిర్మించాల్సి ఉంది.



పావురాలగూడెంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం వేసిన కంకర

అడ్డుకుంటున్న ఆక్రమణదారులు

సాధారణంగా ఆర్‌అండ్‌బీ రోడ్డు పరిధి 66 అడుగులు, గ్రామాల్లో 50 అడుగుల వెడల్పు ఉండాలి. అందులో రోడ్డు నిర్మాణం చేయగా మిగిలిన స్థలం రోడ్డు బౌండరీగా ఉంటుంది. కానీ పావురాలగూడెంలో రోడ్డు కేవలం 12 అడుగులు మాత్రమే ఉంది. రోడ్డు బౌండరీ స్థలంతోపాటూ ఏకంగా రోడ్డును ఇరువైపులా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం గ్రామంలో 18 అడుగుల వెడల్పు సీసీ రోడ్డు నిర్మించాల్సి ఉంది. సీసీ రోడ్డు వేసేందుకు మరో ఆరు అడుగుల వెడల్పు రోడ్డు విస్తరించేందుకు అధికారులు, నిర్మాణదారుడు ప్రయత్నిస్తే స్థానికంగా ఉన్న ఇద్దరు నాయకులు అడ్డుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆ ఇద్దరు నాయకుల ఇళ్లముందు 12 అడుగుల ఇరుకు రోడ్డు ఉండడం ఆధిపత్యపోరుకు కారణమయ్యింది. నాయకుల పోటీతో సీసీ రోడ్డు కంకర పరచడం వరకే పరిమితమైంది.

అధికారులు చెప్పినా..

పావురాలగూడెంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రోడ్డు విస్తరణకు నాయకులను ఒప్పించేందుకు డీఈ, ఏఈతోపాటూ రోడ్డు నిర్మాణదారుడు ప్రయత్నించారు. అయినా వారు ఒప్పుకోకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు కలుగజేసుకుని గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు జరిగేలా చూడాలి



పావురాలగూడెంలో రోడ్డు ఇరుకుగా ఉంది. ఎదురుగా వాహనం వస్తే అర కిలోమీటర్ వెనక్కు పోవాల్సి వస్తోంది. రోడ్డు స్థలాన్ని ఆక్రమించి అభివృద్ధి పనులు జరుగకుండా అడ్డుపడుతున్న వారిపై అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు నిర్మాణం పనులు జరిగేలా చూడాలి.

-గోదల వెంకట్‌రెడ్డి, పావురాలగూడెం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పావురాలగూడెంలో రోడ్డు స్థలం ఆక్రమణకు గురైంది. దీంతో పనులకు ఆటంకం కలుగుతోంది. రోడ్డు కేవలం 12 అడుగులు మాత్రమే ఉండడంతో విస్తరణ చేసేందుకు ప్రయత్నించగా ఇద్దరు వ్యక్తులు అడ్డుకుంటున్నారు. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక అందించాం..

-సంతోష్‌కుమార్ ఆర్‌అండ్‌బీ ఏఈ, శాలిగౌరారం మండలం

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషిచేయాలి

కట్టంగూర్ : బీఆర్‌ఎస్ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్యాలమ్మగూడెంకు చెందిన పలు పార్టీల నాయకులు జెడ్పీటీసీ తరాల బలరాముల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో ముత్యాలమ్మగూడెం గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనే సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఊట్కూరు ఏడుకొండలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి

పార్టీలో చేరిన వారిలో అంజిరెడ్డి, వనం యాదగిరి, మన్నెం ఎల్లయ్య, ఏనుగుల శంకర్, మండల శంకర్, కాసర్ల లింగారెడ్డి, మేకల బలరాం, కాడింగు వెంకన్న, కట్ట పరమేష్, అక్కెనపల్లి సాలయ్య, మారగోని నర్సింహ, వనం యాదగిరి, సుంకరి నర్సింహ తదితరులు ఉన్నారు.

ఏకపక్ష ధోరణి వల్లే ఎంపీపీపై అవిశ్వాసం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీలు

మర్రిగూడ : ఏకపక్ష ధోరణి వ్యవహారం వల్లనే ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డిపై అవిశ్వాసం పెట్టాల్సి వచ్చిందని అసమ్మతి ఎంపీటీసీలు అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో తమ్మడపల్లి ఎంపీటీసీ గండికోట రాజమణి హరికృష్ణ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు మాట్లాడుతూ మండల అభివృద్ధికి రూ.1.30కోట్ల నిధులు మంజూరు కాగా ఎంపీపీ తన సొంత గ్రామానికి రూ.35లక్షలు కేటాయించుకున్నాడని, తమకు మాత్రం నామమాత్రపు నిధులు కేటాయించారని ఆరోపించారు. కాంగ్రెస్‌పార్టీ నుంచి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఎంపీపీ స్వలాభం కోసం రాలేదా అని ప్రశ్నించారు. ఎన్ని స్టేలు తెచ్చినా చివరి వరకు అవిశ్వాసంపై పోరాడుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కట్కూరి వెంకటేష్‌గౌడ్, సిలివేరు విష్ణు, ఏర్పుల శ్రీశైలం, దాసరి మమతగోపాల్, నేనావత్ బంతిలాల్, సర్పంచ్‌లు నల్ల యాదయ్య, మాడం వెంకటయ్య, బిచ్చానాయక్, కొలుకులపల్లి యాదయ్య, ఎండి.రజాక్, గుణగంటి వెంకటేష్‌లు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల ముందస్తు అరెస్ట్

నార్కట్‌పల్లి : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చలో అసెంబ్లీకి వెళ్తున్న రెండో ఏఎన్‌ఎంలను శుక్రవారం నార్కట్‌పల్లి పోలీస్‌లు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో గీత, విజయసుధ, నిర్మల, స్వరూప తదితరులున్నారు.

'చలో అసెంబ్లీ' ని అడ్డుకున్న పోలీసులు

చండూరు : తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం రెండో ఏఎన్‌ఎంలు చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చండూరు పోలీసులు అడ్డుకున్నారు. ఏఎన్‌ఎంలను ఉదయం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సొంత పూచీకత్తుపై సాయంత్రం వదిలేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు నలపరాజు సతీష్, మండల అధ్యక్షుడు దోటి వెంకన్న మాట్లాడుతూ ఏఎన్‌ఎంలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని అన్నారు. అరెస్టయినవారిలో కవిత, సౌజన్య, సుజాత, ముబీనా ఉన్నారు.



నార్కట్‌పల్లి : పోలీసుల అదుపులో ఏఎన్‌ఎంలు

హరితహారంపై నిర్లక్ష్యం వహించొద్దు

చండూరు : హరితహారం కార్యక్రమంపై నిర్లక్ష్యం వహించొద్దని, లక్ష్యాన్ని పూర్తి చేయాల్సిందేనని ఎంపీడీఓ యాకూబ్‌నాయక్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొక్కలు విరివిగా నాటడంతోపాటు క్రీడా ప్రాంగణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ రాణి, కార్యదర్శులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను బతికించాలి

మునుగోడు : హరితహారంలో నాటిన ప్రతి మొక్కను బతికించాలని, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటించాలని ఎంపీడీఓ ఆర్.భాస్కర్ గౌడ్ ఉపాధిహామీ సిబ్బందికి, కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో హరితహారంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో లక్ష్యం మేరకు మొక్కలు నాటించి పెంచి పెద్దచేసే బాధ్యత ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్లదే అన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ సుమలత, తదితరులు పాల్గొన్నారు.



మునుగోడు : సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ

నేడు, రేపు విద్యార్థుల సమస్యలపై నిరాహార దీక్షలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

నల్లగొండ రూరల్ : విద్యార్థు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 5, 6 తేదీల్లో క్లాక్‌టవర్ సెంటర్‌లో నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఐతగోని జనార్దన్‌గౌడ్ తెలిపారు. దీక్షలకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ వైస్ ఎంపీపీ జిల్లాపల్లి పరమేష్, యాదవ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు గంగుల వంశీచంద్, కాంగ్రెస్ యువజన నాయకుడు చర్లపల్లి గౌతమ్, కొంపల్లి రామన్న, మహేష్, రమేష్, స్వామి, కిరణ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

17న ఎమ్మార్పీఎస్ మహాసభ

కనగల్ : ఈ నెల 17న మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నల్లగొండ నియోజకవర్గ ఇంచార్జ్ బొజ్జ చిన్న మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ కో ఇన్‌చార్జ్ కందుల మోహన్, దుబ్బ సత్యనారాయణ, కొమ్ము యాదయ్య, కోటి, సైదులు, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ఆహ్వాన పత్రాలు అందజేత

మునుగోడు : గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాకు హాజరుకావాలని కోరుతూ శుక్రవారం మునుగోడు గురుకుల పాఠశాల ఉపాధ్యాయులకు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గేర నర్సింహ ఆహ్వాన పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి సోమగోని సతీష్, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు వీరయ్య, యాదగిరి, శ్రీనివాస్ రెడ్డి, విజయలక్ష్మి, చంద్రిక, రజిత, జ్యోతి, రెహాన, శిరీష, అనిత, స్వప్న పాల్గొన్నారు.

13న యాదవ యుద్ధభేరి సభ



శ్రీను యాదవ్
నూతన అధ్యక్షుడు

నార్కట్‌పల్లి : ఈ నెల 13వ తేదీన నార్కట్‌పల్లిలో యాదవ యుద్ధభేరి సభ నిర్వహించనున్నట్లు యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర కో ఆర్డినేటర్ నోముల సైదులుయాదవ్, రాష్ట్ర కార్యదర్శి నోముల శేషుయాదవ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల యాదన్నయాదవ్ తెలిపారు. శుక్రవారం నార్కట్‌పల్లిలో మట్టిపల్లి శ్రీను అధ్యక్షతన యాదవ విద్యావంతుల వేదిక మండల స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమావేశానికి యాదక కులస్తులందరూ తరలిరావాలన్నారు. అనంతరం యాదవ విద్యావంతుల వేదిక మండల అధ్యక్షుడిగా మట్టిపల్లి శ్రీను యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గుర్రం సత్యం యాదవ్, ఉపాధ్యక్షులుగా మేడబోయిన నాగరాజ్ యాదవ్, సురేష్ యాదవ్, సలహాదారులుగా కళ్యాణ్ యాదవ్, యాదయ్య యాదవ్, మండల కార్యవర్గ సభ్యులుగా కృష్ణ యాదవ్, చొక్కయ్య యాదవ్, మండల గౌరవ అధ్యక్షులుగా దూదిమెట్ల సత్తయ్య యాదవ్‌లను ఎన్నుకున్నారు. కనకయ్య, గిరి, మహేష్, రామ్ మల్లేష్, సర్పంచ్ మల్లేష్, శ్రీశైలం, శ్రీనివాస్, నర్సింహ, శంకర్, వెంకట్ పాల్గొన్నారు.

మొక్కుబడి కల్యాణ మహోత్సవం

కనగల్ : భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతున్న దర్వేశిపురం(పర్వతగిరి) శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద శుక్రవారం భక్తులు మొక్కుబడి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మహిళా భక్తులు బోనాలతో వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈఓ జల్లేపల్లి జయరామయ్య, అర్చకులు మల్లాచారి, దామెదర్, మహేష్, సిబ్బంది చంద్రయ్య, లింగయ్య, నాగరాజు, ఉపేందర్‌రెడ్డి, లింగస్వామి, ఆంజనేయులు తదితరుల పాల్గొన్నారు.



మొక్కుబడి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

రైతు బీమా దరఖాస్తుకు నేడు ఆఖరి రోజు

కేతేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతుబీమా పథకం అన్నదాతల కుటుంబాలకు అండగా నిలుస్తోంది. ఇంటికి పెద్దదిక్కుగా ఉండే రైతు మృతితో కుటుంబం వీధిన పడొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది. ప్రభుత్వమే ఎల్ఐసీ ప్రీమియం చెల్లించి మృతి చెందిన రైతు కుటుంబాలకు బీమా సొమ్ము అందజేస్తుంది. 18 నుంచి 58 సంవత్సరాల వయసున్న రైతులు ఇందుకు అర్హులు. ఈ ఏడాది జూలై 15 నుంచి ఈ నెల 5వ తేదీలోగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకునేలా అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో చాటింపు వేయించడంతోపాటు రైతు వేదికల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. అయినప్పటికీ చాలామంది రైతులు దరఖాస్తు చేసుకునేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. గతంలో దరఖాస్తు చేసుకోవడంతో నిర్లక్ష్యం చేసిన చాలామంది రైతు కుటుంబాలకు బీమా వర్తించక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా ప్రభుత్వం మరోసారి నమోదు చేసుకునేందుకు ఈ నెల 5వ తేదీ వరకు అవకాశం కల్పించింది.

మండలంలో ఇలా..

మండలంలోని 16 గ్రామాల్లో 29,118 ఎకరాల సాగుభూమి ఉంది. రైతు బీమాకు 13,467 మంది రైతులు అర్హులు కాగా గత ఐదేళ్లలో 160 మంది కుటుంబాలకు రూ.8 కోట్ల పరిహారం వచ్చింది. ఇదివరకు నమోదు చేసుకున్న రైతుల బీమాను ప్రతిఏటా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి రెన్యూవల్ చేస్తుంది. మండలంలో కొత్తగా పాసుపుస్తకాలు పొందిన వారు 2,283 మంది ఉండగా 408 మాత్రమే నమోదు చేసుకున్నారు. శనివారం ఒక్క రోజే గడువు ఉండడంతో నమోదు చేసుకోకపోతే నష్టపోయే అవకాశముందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.



రైతుబీమాకు దరఖాస్తు చేస్తున్న రైతు

గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి



కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చిన రైతులు ఈ నెల 5లోగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి. క్లస్టర్ పరిధిలోని ఏఈఓలకు పట్టాదారు పాసుపుస్తకాలు, నామినీ బ్యాంకు పాసు పుస్తకాల జిరాక్స్‌లను అందజేసి దరఖాస్తు చేసుకోవాలి. గడువులోగా దరఖాస్తు చేసుకోకుంటే బీమా వర్తించే అవకాశం ఉండదు.

-బి.పురుషోత్తం, ఏఓ, కేతేపల్లి

కొనసాగుతున్న స్వీపర్ల సమ్మె



సమ్మె చేస్తున్న స్వీపర్లు

నల్లగొండ టూటౌన్ : జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు కనీస వేతనం పెంచి, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ 40వ రోజు శుక్రవారం జెడ్పీ కార్యాలయం ఎదుట సమ్మె చేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్, సీఐటీయూ జిల్లా నాయకుడు దండెంపల్లి సత్తయ్య సమ్మె శిబిరాన్ని సందర్శించి మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5 నుంచి 15 వరకు సమ్మె ఉధృతం చేయాలని కార్మికులు నిర్ణయించినట్లు తెలిపారు. 5న గడియారం సెంటర్‌లో బడి గంటలతో నిరసన, 6న ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు, 7న జెడ్పీ ముట్టడి, 8న భిక్షాటన, 9న కలెక్టరేట్ ఎదుట ధర్నా, 10న ఆర్డీఓ ఆఫీసు ఎదుట ధర్నా, 11న అర్ధనగ్న ప్రదర్శన, 12 ఉరితాళ్లతో నిరసన, 13న ఒంటి కాలిపై నిరసన, 14న గడ్డి తింటూ నిరసన, 15న ఎన్నాళ్లీ వెట్టి చాకిరి కార్యక్రమాలు చేట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వీపర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పనస నరసింహ, పి.ఎల్లయ్య, సత్తార్, ఎండీ. హనీఫ్, పూలమ్మ, వెంకటనారాయణ, వి.కోటయ్య, దేవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ రూరల్ : గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న కార్మికులకు వారు మద్దతు ప్రకటించి మాట్లాడారు. ఎంపీపీ సుమన్, నారి ఐలయ్య, చెన్నారం సర్పంచ్ వెంకన్న యాదవ్, కరుణాకర్‌రెడ్డి, సరోజ, సత్యనారాయణ, ఈశ్వర్, ఎల్లేష్ పాల్గొన్నారు.

కనగల్ : స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు శుక్రవారం మండలంలోని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు సంఘీభావం ప్రకటించారు. సర్పంచ్‌లు గోలి నర్సిరెడ్డి, దేప నరేందర్‌రెడ్డి, బోగరి రాంబాబు, సుంకిరెడ్డి రమణారెడ్డి, గుండెబోయిన రమేష్ యూనియన్ అధ్యక్షప్రధాన కార్యదర్శులు జిల్లా విజయ్, కొంగల నర్సింహ తదితరులున్నారు.

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె 30వ రోజుకు చేరుకుంది.సమ్మెకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.సలీం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మన్నెం భిక్షం, సీఐటీయూ మండల కన్వీనర్ భీమగాని గణేష్, మద్దతు తెలిపారు. యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు కంచర్ల జానయ్య, పాలడుగు చంద్రయ్య, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఉరి తాళ్లతో నిరసన

చండూరు : సమ్మెలో భాగంగా శుక్రవారం చండూరు మండల కేంద్రంలో జీపీ కార్మికులు ఉరి తాళ్లతో నిరసన తెలిపారు. కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి శివకుమార్, సీఐటీయూ మండల కన్వీనర్ మొగుదాల వెంకటేశం, సైదులు, శంకర్, కొండల్, సురేష్, యాదయ్య, లక్ష్మమ్మ, పార్వతమ్మ, సునీత, కవిత, అంజమ్మ, పాల్గొన్నారు.



చండూరు : ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న గ్రామపంచాయతీ కార్మికులు

దున్నపోతుకు వినతి

మునుగోడు : తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే బుద్ధి సీఎం కేసీఆర్‌కు ప్రసాదించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు శుక్రవారం మునుగోడులో దున్నపోతుకు వినతిపత్రం అందించారు. రెడ్డిమల్ల యాదగిరి, పందుల నర్సింహ, లక్ష్మయ్య, అరుణ, అచ్చమ్మ, లింగమ్మ, ఎల్లమ్మ, పెంటయ్య, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారం 30వ రోజుకు చేరుకుంది. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, వట్టిపల్లి హనుమంతు, ఊరిపక్క లింగయ్య, నక్క నరసింహ, పోలె రాములు, లక్ష్మీకాంత్‌లు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం

నకిరేకల్ : రాహుల్ గాంధీని ఎంపీగా అనర్హుడిన ప్రకటించిన కేసు విషయంలో సూరత్ కోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇవ్వడాన్ని హర్షిస్తూ నకిరేకల్‌లో శుక్రవారం రాత్రి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు వేదాసు శ్రీధర్ ఆధ్వర్యంలో రాహుల్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గుండా జలంధర్‌రెడ్డి, గునగంటి రాజు, ముద్దం విజయ్, నాగరాజు పాల్గొన్నారు.

అంగడి స్థలం పరిశీలన

నార్కట్‌పల్లి : గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నార్కట్‌పల్లిలోని అంగడి స్థలం పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అంగడిలో జీవాల అమ్మకం, కొనుగోళ్లు, అంగడిలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుకున్నారు. అనంతరం శంకరయ్య మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వ్యాపారులు వచ్చే ఈ అంగడిలో జీవాలకు సరిపడా స్థలం లేకపోవడంతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆనంద్, రామలింగయ్య, ఐలయ్య, మల్లేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నకిరేకల్ : పట్టణంలోని వివిధ వార్డుల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బాలాజీకి వినతిపత్రం అందజేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు పల్స శ్రీనుగౌడ్, గుడుగుంట్ల సాయన్న, తాటికొండ రామ్మూర్తి, పాలడుగు నగేష్, అప్పం అంజయ్య, నారగోని వెంకటేశ్వర్లు, గుర్రం నాగచంద్, శ్యాంరెడ్డి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న యూనియన్ నాయకులు

నల్లగొండ టూటౌన్ : హైదరాబాద్‌లోని ఉప్పల్ బాగాయత్‌లో జర్నలిస్ట్ భవనం కోసం స్థలం కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ టీయూడబ్ల్యూజే (143) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్‌లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, మీడియా అకాడమి చైర్మన్ అల్లం నారాయణ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్‌గౌడ్, దుర్గాప్రసాద్, చిన్నపత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు వెన్నమళ్ల రమేష్ బాబు, నియోజకవర్గ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వంగాల శ్రీనివాసరెడ్డి, దండెంపల్లి రవికుమార్, అంజయ్యగౌడ్, కంది సూర్యనారాయణ, మదనాచారి, నరేందర్, శ్రీనివాస్, సైదులు, చంద్రశేఖర్, లెనిన్, యాదగిరి, మధు, వెంకన్న, ప్రవీణ్, సందీప్, యశ్వంత్ పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

చండూరు : మున్సిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు సునీత, కేదారి, జగదీశ్వరి, అస్మాబేగం, కృష్ణవేణి పాల్గొన్నారు.

చిట్యాల : తాళ్లవెల్లెంల గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వెలిమినేడు గ్రామంలోని ఆస్పత్రి వద్ద వెలిమినేడు, గుండ్రాంపల్లి, సుంకెనెపల్లి గ్రామాల నుంచి వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు ఆరోగ్యలక్ష్మీ భోజనాన్ని అంగన్‌వాడీ టీచర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ధనలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

మర్రిగూడ : మేటిచందాపురంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సర్పంచ్ జంగిలి లక్ష్మీప్రసన్నరవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

కట్టంగూర్ : పాముకాటుతో మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని గార్లబాయిగూడెం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గార్లబాయిగూడెం గ్రామానికి చెందిన పర్వతం నర్సమ్మ(38) తన ఇంటి వద్ద కిరాణం దుకాణంతోపాటు చికెన్ షాపు నిర్వహిస్తోంది. సాయంత్రం చికెన్ గిరాకీ రావడంతో బోనులో ఉన్న కోడిని తీస్తుండగా అప్పటికే అందులో ఉన్న పాము నర్సమ్మను కాటు వేసింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె, భర్త ఉన్నారు.